దాదాపు ఎనిమిది ఏళ్ల తర్వాత ఆ వూరికిదే ప్రయాణం. ఏవో బలహీనతలు నన్ను ఇల్లు కదల నివ్వవు. ఇపుడు ఈ ప్రయాణం కారణంగా వారం రోజులు సెలవు... అయిదు వందలు ఖర్చులు. నిజానికి ఈ ప్రయాణానికి మరో కారణం కూడా లేక పోలేదు. అది నాకు గురువుగారైనా, దేవుడైనా వెంకట్రామయ్య గారి ఉత్తరమనే చెప్పాలి. ఈ ఉత్తరం వచ్చి కూడా రెండు మూడు నెలలు కావస్తోంది.

వెంకట్రామయ్యగారు నాకు దేవుడని చెప్పు కోవడంలో గర్వం వుంది. ఆనందం వుంది. తృప్తి వుంది. నా చదువు ఆయన వద్ద కాకుండా మరొకరి చోట జరిగి వుంటే.. ఎలా వుండేదో, ఊహిస్తేనే భయం కలుగుతూ వుంటుంది. ఆ వూరికి, హైస్కూలు రావడానికి ఆయన కృషి, పట్టుదల కారణమని చెప్పాలి. విద్య యొక్క విలువ, విశిష్టత, ప్రాముఖ్యత ఆయన విద్యార్థుల కందరికీ తెలుసు. ఆయన పాఠాలు చదువుకే పరిమితం కావు. జీవిత సత్యాలు కూడా వారి బోధనలో చోటు చేసు కుంటాయి. ఆ రోజుల్లో ఏ విద్యార్థీ ఆయన క్లాసుని బహిష్క రించేవాడు కాదు. నమస్క రించకుండా వుండనూ లేదు.

బి.ఎస్.సి పాసయ్యాక, అంటే ఇరవై ఏళ్ల క్రితం, వెంకట్రామయ్య గారింటికి వెళ్లాను. "ఏరా... అయితే ఇప్పుడు ఏం చేద్దా మను కుంటున్నావు" అని అడిగే రాయన.

"బి.ఇడి ట్రైనింగ్ అవుదా మను కుంటున్నాను" అన్నాను.

"నీకు బుద్ధుందా"

"ఏం మాస్టారూ" అని అడిగాను.

"నా అనుభవం తెలిసి కూడా టీచరు ఉద్యోగం చేద్దామను కోవడం ఏమీ బాగా లేదు. ఈ వృత్తి ఇపుడు చాలా కష్టంగా వుంటోంది. విద్యార్థులు ఎదురు తిరుగు తున్నారు. వారి తల్లి దండ్రులు కూడా అంతగా శ్రద్ధ చూపడం లేదు. హాయిగా ఏదైనా ఆఫీసుల్లో ఉద్యోగం అయితే మంచిది. మనిషికి డబ్బుతో పాటు విశ్రాంతి చాలా అవసరం" అన్నారాయన.

ఆరునెలల నిరుద్యోగం వెళ్ల బెట్టాక గవర్నమెంటు ఆఫీసులో ఉద్యోగం వచ్చింది. ఆ విషయం చెప్పేందుకు, వారి ఆశీర్వాదం పొందేందుకు వెంకట్రామయ్య గారింటికి వెళ్లాను.

"చూసావ్రా.. నీ స్వయం కృషి పూరికే పోలేదు. ఉద్యోగంలో ఆత్మ విశ్వాసం, నిజాయితీ ముఖ్యం. పని పేర పెట్టి సోమరిగా తిరిగితే ప్రయోజనం లేదు. ఉద్యోగం ఇచ్చిన ప్రభుత్వానికి నీ కృతజ్ఞత రోజూ చూపాలి" అన్నారాయన నా భుజం తడుతూ.

"మీరు నాకు చదువు చెప్పారు. మీ ఆశీర్వాద బలమే నన్ను ఉద్యోగిని చేసింది. దేవుడున్నాడో లేడో నాకు తెలియదు నాకు మాత్రం మీరు ప్రత్యక్ష దైవం" అన్నాను కృతజ్ఞతతో.

ఏడాది ఉద్యోగ జీవితం తరువాత మళ్ళీ వాళ్లింటికి వెళ్లాను. "ఏరా.. పెళ్ళెపుడు చేసు కుంటున్నావు" అని ప్రశ్నించారు వెంకట్రామయ్యగారు.

"అపుడే పెళ్లేమిటండీ" అన్నాను.

"నీకకిపుడు వయసు ఇరవై రెండు అని నాకు తెలుసు. పెళ్లి కిదే సరైన వయసు. పెళ్లి చూపుల పేరుతో అమ్మాయిలను చూడడం అంతగా మంచిది కాదు. ఏ అమ్మాయి లోనైనా కొన్ని ప్లస్ పాయింట్లు మరికొన్ని మైనస్ పాయింట్లు వుంటాయి. అయితే చూసిన ఏ అమ్మాయినీ మరో అమ్మాయితో పోల్చడం మంచిది కాదు. ఇద్దరు పిల్లల తరువాత ప్రయత్నించడం మంచిది కాదు" అన్నారు వెంకట్రామయ్యగారు.

వారి సలహా ప్రకారమే చేశాను.

పదేళ్ల క్రితం ఓ వార పత్రికలో ఒక కథ రాసాను. పదిహేను రోజుల తర్వాత మాస్టారి నుంచి ఉత్తరం వచ్చింది.

సరే వెళ్ళాను. నేను వెళ్లే సరికి వెంకట్రామయ్యగారు ఏదో పెళ్ళి సంబంధం నిమిత్తం వెళ్లారని వారి శ్రీమతి-సీతమ్మ గారు చెప్పారు. "బాగుందయ్యా... కథలు కూడా రాస్తున్నావన్న మాట" అంటూ.

"ఏదో.. అపుడపుడు.. సరదాగా" అంటూ.

"నువ్వు ఇలాగే కథలు రాస్తూ పెద్ద రచయితవై పోవాలి. నీ భార్య, పిల్లలు ఆరోగ్యంగా, ఆనందంగా వుండాలి" అంటూ ఆశీర్వదించారు సీతమ్మ గారు. ఆవిడ వైపు పరీక్షగా చూశాను. పార్వతీ దేవిలా వుందావిడ. కాళ్లకు వెండి కడియాలు.. చేతులకు మట్టి గాజులు.. ముఖానికి పచ్చగా పసుపు... కొప్పులో పూలు... మొఖానికి వెలుగిస్తూ రూపాయి బిళ్లంత కుంకుమ బొట్టు.. ఆవిడకు రెండు చేతులతో నమస్క రించినా తీరనిది.. ఆ దేవత చేతిలో యాభై రూపాయలు వుంచాను.

"ఏమిటయ్యా ఇది" అంటూ ఆ డబ్బును ఇవ్వ బోయారావిడ.

"ఉంచండి. మీ ఇంట్లో వుండి చదువు కుని ఉద్యోగస్తుడ్నయినందుకు మాస్టారుకి, మీకు బట్టలు పెట్టాలి. కానీ మీరు తీసు కోరు. అందుకే ఈ స్వల్ప సైకంతో మిమ్మల్ని సత్కరిస్తున్నాను" అన్నాను.

"భలే వాడివయ్యా.. పెట్టు పోతలు వుండాలా! ప్రేమ, అభిమానం, కృతజ్ఞత వుంటే చాలదూ" అన్నారావిడ.

నిజమే. అంతకన్నా ఏం కావాలి!

గంట తర్వాత వెంకట్రామయ్య గారు వచ్చారు. "ఏం మాస్టారు, కులాసాగా వున్నారా" అంటూ పలక రించాను.

"అయితే నా ఉత్తరం అందిందన్న మాట... ఏమిటీ, కథలు కూడా రాయడం మొదలెట్టా వన్నమాట.. అయినా మీ ఇంటా వంటా లేని అలవాటు నీకెలా అబ్బింది" అన్నారు ఆయన.

"సరదాగా మొదలెట్టాను"

"నా విద్యార్థుల్లో ఎవరూ కథలు రాయడం లేదు. ఏదో నువ్వు రాస్తున్నావని సంతోషిస్తుంటే-ఆ సంతోషాన్ని మిగుల్చు కోనీకుండా చేసిందో కథ..." అంటూ ఓ క్షణం ఆగారాయన.

"ఏ కథ మాస్టారు" అని అడిగాను

వెంకట్రామయ్యగారు లోపలికి వెళ్లి ఆ పత్రిక తెచ్చారు "ఈ కథ' అంటూ.

నేను చాలా సిగ్గు పడ్డాను.

"పత్రికల్లో వచ్చే కథలూ అన్ని వయసుల వాళ్లు చదువు తారు. ఈ కథను నువ్వు నీ పిల్లల ఎదుట ధైర్యంగా చదవ గలవా... ఇలా చవక బారు రచనలు చేసి, సాహిత్యానికి బురద చల్లకు. దంపతుల మధ్య జరిగే శృంగారాన్ని అక్షరాలుగా పేర్చి ఓ కథ అంటే సరి పోతుందా... ద్వంద్వార్థా లతో, విపరీతా కర్షణలతో కథలేమిట్రా..." అంటూ మందలించారు.

నిజానికి ఆ కథ నాకు పెద్ద తల వంపు తెచ్చి పెట్టింది. ఎవరినీ ఆ కథ గురించి అడగ లేక పోయాను. ఎంతో బాధ కలిగింది కూడా. అప్పట్నుంచి అటువంటి కథలు రాయడం మానేశాను.

ఆలోచనలను పక్కకు బెట్టి ఉళ్లోకి అడుగు పెట్టాను. మరో అయిదు నిముషా లకు వెంకట్రామయ్య గారింటి ముందు నిలి చాను. సాధారణంగా అరుగు మీదే కనిపిస్తారు ఆయన-ఏ పేపరు చదువుతూనో.. లేక ఎవరి తోనో కబుర్లు చెప్తూనో..

రెండుమూడు నిముషాలు నిశ్శబ్దం.

"మాస్టారు.." అని పిలిచాను.

ఏ అలికిడీ లేదు. మరోసారి పిలిచాను.

అపుడొచ్చారు సీతమ్మగారు.

ఆవిడను చూసి ఆశ్చర్యం.. ఆ తర్వాత విచారం, బాధ. 'ఏమయింది మాస్టారుకి' చట్టుకున్న ఆవిడ దగ్గరికి నడిచాను.

'ఆయన వెళ్లి పోయారయ్యా' అంటూ ఏడవ సాగారావిడ.

"మాస్టారు చనిపోయారా.. ఎలా" అని అడిగాను.

"నాలుగు రోజులు జ్వరం..." ఆపైన ఏమీ మాట్లాడ లేక పోయారావిడ. పమిట కొంగుతో కళ్లు ఒత్తుకోవడం తప్పించి.

"మిమ్మల్ని ఈ స్థితిలో చూస్తా నను కోలేదు" నాకు దుఃఖం ఆగ లేదుస. మాస్టారి పట్ల దేవుడికి ఎందుకింత నిర్దయ?

"ఏం చేయను.. ఎన్నాళ్లని ఎవ రుంటారు... ఎవరి సంసారాలు, బతుకులు వారివి... ఎవర్నుండ మంటే ఎవరు వింటారు... చచ్చే వరకూ నాకు తప్పదుగా.." అన్నారు సీతమ్మగారు దుఃఖిస్తూ.

విధి ఆడించే చదరంగంలో ఎవరి కెవరు సొంతమూ.. ఎంతవరకీ బంధమూ... ఋణాను బంధం ఎంత వరకూనో.. అనిపించింది.

"బాబూ... అంత జ్వరం లోనూ మీ మేస్టారు ఈ ఉత్తరం నీకు రాసారు" అంటూ ఆవిడ లోపలికి వెళ్లారు.

ఎదురుగా వెంకట్రామయ్య గారి ఫోటో. ఫోటోకి దండ! ఫోటో లోని మాస్టారు చిద్వి లాసంగా నవ్వు తున్నారు. పోయినోళ్లందరూ మంచోళ్లు అన్నట్టుగా.

"ఇదుగోనయ్యా ఉత్తరం" అంటూ కవరు తెచ్చి నా చేతిలో పెట్టారు సీతమ్మ గారు.

ఉత్తరం అందు కుంటుంటే నా చేయి వణికింది.

ఎట్లాగో అందుకుని చదవ సాగాను.

ఒరేయ్... రావూ... ఈ మధ్య కాలంలో నా ఆరోగ్యం, మనసు ఏమీ బాగుండడం లేదు. పత్రికల్లోని నీ కథలు చదువు తుంటే నిన్ను చూస్తున్నట్టే అని పిస్తోంది. నా మాట విని నువ్వు మంచి కథలు రాస్తు న్నందుకు సంతోషంగా వుంది. నిన్నో సారి చూడాలని వుంది. ఒక్కసారి వీలు చేసుకుని రా. నేను పోయాక ఈ వూరు రావడం మానకు. ఈ వూళ్లో నీకు నీ మాస్టారు గారి భార్య వుంది. నువ్వు చదివిన స్కూలు వుంది. చెరువు వుంది. ఈ వూరితో నీకు ఎంతో అనుబంధం వుంది. ఉద్యోగ ధర్మం జాగ్రత్తగా నిర్వ ర్తించు. నీ భార్య, పిల్లలకు ఆశీస్సులు.. తప్పక వస్తావు కదూ.." అంటూ.

ఉత్తరం మీద నా కళ్లు వర్షించ సాగాయి.

విధి విచిత్రం అంటే ఇదే కాబోలు

మాస్టారికి నా మీద వున్న ప్రేమాను రాగాలు మరోసారి ఉత్తరం ద్వారా వ్యక్త మయ్యాయి.

సీతమ్మ గారి వైపు పరీక్ష గా చూశాను. పార్వతీ దేవిలా కళగా వుండే ఆ రూపం ఇపుడు మాస్టారి మరణంతో బోసిగా వుంది. సీతమ్మ గారి మెడలో ఆయన కట్టిన తాళితో పాటు మాస్టారి ఉనికిని చూపించే బొట్టు కూడా లేదు. ఏమిటో ఈ ఆచారాలు, కట్టు బాట్లు! భర్త చనిపోతే భార్యకు పసుపు కుంకుమలు వుండ కూడదా! సుమంగళిగా సీతమ్మ గారికి చూడ లేని నా దురదృష్టాన్ని తిట్టు కున్నాను.

"ఈ ఇంటిని అమ్మకం పెట్టారు మావాళ్లు. ఇకపైన నువ్వు ఈ వూరు రావలసిన అవసరం వుండదు. నేను మా పిల్లల దగ్గరికి వెళ్లి పోతున్నాను. ఇక్కడ నేను ఒంటరిగా ఎందు కయ్యా.. ఏ టైమ్లో నా కెలా గుంటుందో.. ఏదో రోజున నేనూ మాస్టారి దగ్గరకు పోవాల్సిందేగా.." అంటూ నొచ్చు కున్నారావిడ.

"అదేమిటమ్మా... ఇల్లు అమ్మే స్తున్నారా"

"అవునయ్యా.. వాళ్లకి ఈ వూరితో అవసరం ఏముంది.. ఎటూ కన్న తండ్రి లేరు. ఆయన సంపాదించిన పొలం అమ్మేశాక, ఇక ఇల్లు కూడా ఎందుకు అను కుంటున్నారు వాళ్లు.. అరవై సంవత్సరాల ఈ ఇంటిలో నాకు బంధం తెగి పోతుంది.." అన్నారు సీతమ్మగారు.

ఎప్పట్నుంచో నాకు మా సొంత వూరులోనో, దగ్గర్లోనో ఇల్లు కొనాలని వుంది. నగరం లోను, పట్టణం లోనూ జీవితం కష్ట మయి పోతుంది. ధరల మోత అటుంచి, వస్తువు దొరకడం కూడా దుర్లభ మయి పోతుంది. దానికి తోడు ఏ సమయంలో ఏం గొడవలు వచ్చి పడతాయో.. గ్రామ జీవితం, పల్లెల బతుకులే హాయిగా వుంటు న్నాయి. స్వచ్ఛమైన గాలీ, కల్తీ లేని కాయ గూరలు, పాలు దొరుకు తాయి. అన్నింటికీ మించి మనసున్న మనసులు మసలేది గ్రామాలే..."

నా ఉద్దేశ్యం సీతమ్మ గారితో చెప్పాను.

ఆవిడ ముఖం వెలుగుతో నిండి పోయింది.

"మీ ఇల్లు నేను కొనుక్కున్నా అందులో మీరు వుండ వచ్చు.. నేను ఈ చుట్టు పక్కలకు బదిలీ చేయించు కుంటాను.. ఏమంటారు" అని అడిగాను.

ఆనందంతో ఆవిడ ముఖం జ్యోతిలా వెలిగింది.

"మీ పిల్లలకు ఈ విషయం రాసి కనుక్కోండి" అన్నాను.

"ఈ విషయంలో మాత్రం వాళ్లు నా మాట కాదనరు" అందావిడ.

పావుగంట తర్వాత సెలవు తీసుకుని తిరుగు ప్రయాణం అయ్యాను. మాస్టారి ఇల్లు నా సొంతం కాబోతుందన్న సంతోషంతో!